క్లుప్తంగా

కృష్ణా జలాలపై ఎమ్మెల్యే ప్రశ్నించాలి

–సీపీఐ డిమాండ్

మదనపల్లి: మదనపల్లెకు కృష్ణా జలాలు ఎందుకు ఇవ్వడంలేదో టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కృష్ణా జలాల విషయంలో మదనపల్లె, పుంగనూరుకు అన్యాయం జరుగుతున్నా టీడీపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఒక్క చెరువుకు నీటిని ఇవ్వడం లేదని, చిప్పిలి, గుంటివారిపల్లె సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను ఎందుకు నింపడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణ ప్రజలు, రైతాంగం ప్రయోజనాలను విస్మరించడం అన్యాయమని అన్నారు. దీనిపై స్పందించి నియోజకవర్గానికి కృష్ణా జలాలు మళ్లించేలా ఎమ్మెల్యే కృషిన చేయాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ తరఫున ఆందోళన కార్యక్రమాలను చేపడ్తామని పేర్కొన్నారు.

అంజన్న ఆలయంలో పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం చెన్నైకు చెందిన విశ్వవిష్ణు సహస్ర నామ సంస్థానం వారిచే సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. లోక కళ్యాణార్థం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు

తంబళ్లపల్లె: మండలంలోని పాడి రైతులు పశుగ్రాసం సాగు చేసుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీపై పది టన్నుల మొక్కొజొన్న విత్తనాలు అందినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. 5 కేజీల బ్యాగ్ రూ.85 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శనివారం కన్నెమడుగు పశువైద్యశాలలో రైతులకు సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. గుండ్లపల్లె పశువైద్య కేంద్రం, కోసువారిపల్లె, కోటకొండ, గోపిదిన్నె, కొటాల గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్‌పాసుపుస్తకం జిరాక్సు కాపీలతో విత్తనాలు తీసుకోవచ్చునన్నారు. పాడి రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు : తమ ప్రభుత్వంలో మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజల ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సంక్షేమాని కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల ఇంటి నివాస స్థలం మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గణేష్ ఊరేగింపు, నిమజ్జనం శాంతియుతంగా జరగాలి

పీలేరురూరల్ : గణేష్ ఊరేగింపు, నిమజ్జనం శాంతియుతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ యుగంధర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం పీలేరు పట్టణంలో సామూహికంగా జరిగే ఊరేగింపు, నిజమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. సౌండ్ సిస్టమ్‌లో రాజకీయ నేతల పాటలు పూర్తిగా నిషేదమని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఊరేగింపు ప్రారంభమై, రాత్రి 9 గంటలకు నిమజ్జనం పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనాలు దారి మళ్లింపు

గణేష్ నిమజ్జనం సందర్భంగా పీలేరు పట్టణంలో ఆదివారం కొత్త ట్రాఫిక్ రూల్స్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణీకులు, వాహనచోదకులు సహకరించాలని కోరారు. తిరుపతి – మదనపల్లె మధ్య తిరిగే వాహనాలు పట్టణంలోకి అనుమతి లేదని, నాలుగు లేన్ల జాతీహ రహదారి గుండా వెళ్లాలని తెలిపారు. కడప – చిత్తూరు రోడ్డు మార్గంలో వెళ్లేవారు బైపాస్ గుండా మొరవవడ్డిపల్లె వద్దకు వెళ్లి అక్కడి నుంచి కోటపల్లె క్రాస్ గుండా చిత్తూరు రోడ్డు మార్గంకు వెళ్లాలని తెలిపారు.

శ్రీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని అందంగా అలంకరించారు. గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామున అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

ఏకదంతాయ.. బహురూపాయ

- మండపాల వద్ద భక్తుల సందడి
- ఆకట్టుకుంటున్న వినాయకుని ప్రతిమలు

మదనపల్లె సిటీ: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె పట్టణంలో పలు కాలనీల్లో వెలసిన వినాయకుడు పూజలందుకుంటున్నాడు. మండపాల వద్ద రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వినాయకుని మండపాల వద్ద భక్తులతో సందడి నెలకొంది. పలువురు దాతలు అన్నసంతర్పణలు చేస్తున్నారు. పట్టణంలోని కమ్మవీధిలో 12 అడుగుల భారీ వినాయకుడు సింహవాహనంపై బాహుబలి అలంకారంలో భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటుంది. సిపాయివీధిలో మత్స్యావతార అలంకారం, అమినేనివీధిలో అశ్వవాహనంలో వినాయకుడు ఆకట్టుకుంటుంది. దీంతో కాలనీల్లో వివిధ రూపాల్లో వినాయకుని విగ్రహాలు పూజలు చేస్తున్నారు.

వైభవంగా గణపయ్య నిమజ్జనం

కలికిరి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన కార్యక్రమం మండల వ్యాప్తంగా భక్తులు వైభవంగా శనివారం నిమజ్జనం చేశారు. నాలుగు రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యను ప్రత్యేక పుష్పాలంకరణ వాహనాల్లో కళాకారుల కోలాటాలు, వేషదారణలు, బళ్ళారి డ్రమ్స్ వాయిద్యాల నడుమ రంగులు చల్లుకుంటూ మండపాల నుంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించి రాత్రి నిమజ్జనం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలుగా పోలీసు బందోబస్తు, నిమజ్జనం వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టారు. రాజువారిపల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన వాహనం పుష్పాలంకరణ, కళాకారుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఘనంగా వినాయకుడి ఊరేగింపు

కేవీపల్లె : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కేవీపల్లెలో వినాయకుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి నాలుగు రోజులపాటు పూజలు నిర్వహించారు. శనివారం గణేష్ విగ్రహాన్ని చాందిని బండిపై అలంకరించారు. బళ్లారి డ్రమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో గణనాథున్ని ఘనంగా ఊరేగింపు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలో చెరువులో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జగణపయ్యల నిమజ్జనం


రామసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయకుని విగ్రహాలు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. వనగానిపల్లి, గుంతయంబాడి, మూగవాడి, గుండ్లపల్లి, ఎర్రప్పల్లి తదితర అనేక గ్రామాల్లో యువకులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ డంపు వాయిద్యాల నడుమ టపాకాయల పేలుళ్లతో ఘనంగా ఊరేగించారు. ఇంటింటా మహిళలు కర్పూహారతులు అందజేశారు. గణపతి బొప్పా... మోరియా అంటూ యువకులు ఉత్సాహంగా నినాదాలు చేశారు.



సింహవాహనం అలకారంలో 12 అడుగుల భారీ వినాయకుడు



సిపాయివీధిలో వెలసిన మత్స్యావతార వినాయకుడు



అమినేనివీధిలో వెలసిన అశ్వవాహనంపై వినాయకుడు



రామసముద్రం: గుంతయంబాడిలో బొజ్జగణపయ్య ఊరేగింపు



కేవీపల్లె: గణేష్ విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తులు



కలికిరి: పుష్పాలంకరణ వాహనంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

చెరువులకు కృష్ణా జలాలు ఎక్కడ బాబూ ?

- మదనపల్లెపై కూటమి ప్రభుత్వానికి కక్ష
- సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లి: మదనపల్లె నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలు ఎప్పుడు తరలిస్తారని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ ప్రశ్నించారు. పార్టీ చేపట్టిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మదనపల్లె రూరల్ మండలం పొన్నుటిపాళెం పంచాయతీ చిప్పిలి, పట్టణంలోని సుభాష్‌రోడ్డు, ఎంజీ.నగర్, రాంగోపాల్ నాయుడు వీధిలో ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హామీల మోసాలను వివరిస్తూ పథకాలు అమలవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి అమలైన హామీల ద్వారా ఏ మేరకు లబ్ధిపొందారో తెలపాలని కోరుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై పథకాలు అందడం లేదని, హామీలను నమ్మి మోసపోయామని మహిళలు ఆయనతో వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మీదుగా కృష్ణా జలాలు కుప్పం వైపుకు వెళ్తున్నాయని, అయితే నియోజకవర్గంలోఒక్క చెవువుకైనా చుక్కనీరు ఇవ్వకపోయినా చెరువులను నింపినట్లు పచ్చ మీడియాలో కథనాలు ఇవ్వడం దారుణమన్నారు. నీళ్లివ్వకనే నీళ్లిచ్చినట్లు, భూములఖు సాగులోకి వస్తున్నట్లు పేర్కొనడం మోసమన్నారు. అర్భాటంగా జలహారతులు ఇవ్వడం కాదు..మదనపల్లె పట్టణప్రజల దాహం తీర్చే చిప్పిలి, గుంటివారిపల్లె సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులకు జలాలను తరలించి నింపాలని కోరారు. వేసవిలో ఈ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తాయని అన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కృష్ణా జలాలను కుప్పానికి మాత్రమే తరలించి చెరువులు నింపుకుంటారన్నారు. మదనపల్లెపై నిర్లక్ష్యం చేస్తూ ఒక్క చెరువుకు నీళ్ల ఇచ్చేలా కనిపించడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు జి.షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నీ మాయ మాటలే చెబుతోందన్నారు. మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్ఫాన్‌ఖాన్, చంద్రశేఖర్, వీఎస్.రెడ్డి, మయూరి రఘునాథరెడ్డి, ఆంజనేయులు, ఈశ్వర్‌నాయక్, శారదరెడ్డి, వినుతాబాయి, జగన్నాథరెడ్డి, మహేష్, మల్లికార్జున, నవాజ్ అలీ, యూనస్ తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ మోసాలను మహిళలకు వివరిస్తున్న నిసార్ అహ్మద్

బాలాజీనగర్ వినాయక లడ్డూ రూ.1.90 లక్షలు

మదనపల్లె రూరల్ : వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా శనివారం బాలాజీనగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లడ్డూకు వేలం పాటలు నిర్వహించారు. అందులో బాలాజీనగర్‌కు చెందిన చల్లా శంకర 1లక్ష 90 వేల 501 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం వినాయక స్వామి వారి నిమజ్జన వేడుకలను బళ్లారి డ్రమ్స్, మేళతాళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని చివరిసారిగా దర్శించున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు, స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండలంలోని పాతకాలేజీ మైదానంలో గణేష్‌యూత్ ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహానికి నాల్గవ రోజు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. దాతలు మంచాల క్రిష్ణమూర్తి కుటుంబసభ్యులు వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



మదనపల్లెలో రూ.1.90లక్షలకు లడ్డూను దక్కించుకున్న చల్లా శంకర

భూ రికార్డులు సమర్పించాలని నోటీసులు

మదనపల్లె రూరల్ : కోళ్లబైలు పంచాయతీ సర్వేనెంబర్.605–2బికి సంబంధించి భూహక్కు ఆధారపత్రాలు, అనుభవ రికార్డులను పదిరోజుల్లోపు మండల రెవెన్యూ కార్యాలయానికి సమర్పించాల్సిందిగా తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి నోటీసులు జారీచేశారు. ఆంధ్రప్రదేశ్ పట్టాదారు పాసుపుస్తకాల చట్టం –1971, నిబంధన–6 ప్రకారం మార్జినుదారులైన కొరముట్ల మురళీ, కొరముట్ల సూర్యశేఖర్...సర్వేనెంబర్.605–2బికి సంబంధించి తమ వద్ద ఉన్నటువంటి హక్కు ఆధారపత్రాలు(ఒరిజినల్ కాపీలు), అనుభవ రికార్డులను సెప్టెంబర్ 10వ తేదీలోపు నేరుగా, ఏజెంట్, అడ్వకేట్ ద్వారా రెవెన్యూ కార్యాలయానికి సమర్పించాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. సమర్పించలేని పక్షంలో భూమికి సంబంధించి ఎటువంటి రికార్డులు లేవని భావించి, కార్యాలయంలోని రెవెన్యూ రికార్డుల మేరకు తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. నోటీసులో పేర్కొన్న వివరాలు... కోళ్లబైలు పంచాయతీలోని సర్వేనెంబర్.605–6లోని 2.88 ఎకరాల విస్తీర్ణం డీకేటీ నెంబర్.785/4/1966 కింద మొండి గంగన్నకు పట్టా మంజూరైందని, తర్వాత దీనిని సర్వేనెంబర్.605/2బిగా మార్పిడి చేశారన్నారు. మొండి గంగన్నకు సంతానం లేనందున చెల్లెలు కొడుకులైన పెద్ద వెంకటరమణ, చిన్నరెడ్డెప్పకు రిజిస్టర్ వీలునామా ద్వారా సంక్రమించి భూమి అనుభవంలో ఉన్నట్లు పేర్కొన్నారన్నారు. అయితే ఇదే భూమికి కొరముట్ల మురళీ...మిలిటరీ పట్టా పొందినట్లు, దస్తావేజు ద్వారా బంధువైన కొరముట్ల సూర్యశేఖర్‌కు అమ్మివేశారని, దీనికి సంబంధించి పేర్కొంటున్న ఏఎం.నెం.39/04/1401 తట్ట వెంకటరమణారెడ్డి పేరుతో అసైన్‌మెంట్ మంజూరుచేసినట్లుగా అసైన్‌మెంట్ రిజిస్టర్–4లో ఉందన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు ?



ఇర్ఫాన్

మదనపల్లె: నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పగా ప్రకటించిన చంద్రబాబు ఉద్యోగాలు ఏలాగో కలిప్పంచలేరని, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్‌కే.ఇర్ఫాన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడచినా నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు సమయం సరిపోలేదా అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్టు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కల్పిత మాటలను నిరుద్యోగులకు నమ్మించి మోసం చేశార న్నారు. ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ప్రతి నిరుద్యోగికి రూ.3వేల భృతిని 2024 జూన్ నుంచి అమలు చేసి చెల్లించాలని డిమాండ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పీలేరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పీలేరు పట్టణంలోని పలు వినాయకస్వామి మండపాల వద్ద పలు సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. నాలుగు రోజులుగా మండపాల వద్ద సాంప్రదాయ నృత్యాలు, డీజే డ్యాన్సులు, కోలాటాలు, చక్క భజనలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్వీ డీలక్స్ రోడ్డులో ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బాల్య వివాహాలు అరికడదాం



మాట్లాడుతున్న జడ్జి మహేష్

పీలేరురూరల్ : సమాజంలో సమిష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండాలో బాల్య వివాహాల నివారణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చదుకునే వయస్సులో వివాహం చేసుకోరాదన్నారు. పూర్తిగా శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేనిదే వివాహం చేసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి ఆర్. మురళి, ఎంపీడీవో శివ శంకర్, డీటీ ప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, ఎంఈవో పద్మావతి, సీడీపీవో రాజమ్మ, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, న్యాయవాది షౌకత్‌అలీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

నిమ్మనపల్లె : దళితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్ బాబు, డీటీ సిరాజుద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని సామకోటవారిపల్లె పంచాయతీ యర్రంవారిపల్లెలో సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సివిల్‌రైట్స్ డే ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దళితవాడల్లో అవసరమైన కనీస సౌకర్యాలు కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ...నామమాత్రంగా సివిల్ రైట్స్ డే నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, సమావేశాలకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోతే, సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. సెప్టెంబర్ 30వ తేదీ నిర్వహించే సివిల్ రైట్స్‌డేకు మండలస్థాయి అధికారులందరూ హాజరుకావాలని, లేకపోతే సమావేశాన్ని బహిష్కరిస్తామన్నారు.

ఆవిష్కరణలలో ముందడుగు వేయాలి

- పరిశోధన సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- వీసీ యువరాజ్

కురబలకోట: ఆవిష్కరణలలో ముందడుగు వేయాలని, కార్పొరేట్ కేరీర్‌కు నెట్‌వర్కింగ్ ముఖ్యమని బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సమ్మిట్ వక్తలు పేర్కొనట్లు అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ యువరాజ్ శనివారం తెలిపారు. బెంగళూరులోని బ్రిగ్రేడ్ గేట్‌వేలో జరిగిన అంర్జాతీయ సింగులారిటీ ఇండియా సమ్మిట్–25 దార్శనికులు, పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు, వ్యవస్థాపకులు, విధాన రూపకర్తలతో ప్రధాన వేదికగా మారిందన్నారు.అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన 120 మంది బిటెక్, ఎంబీఏ,ఎంసీఏ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌పై వీసీ యువరాజ్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, పునరుత్పాదకశక్తి, స్మార్ట ఇన్‌ఫ్రాక్చర్‌లలో పురోగతి ఆవిష్కరణలపై దృష్టి సారించడం జరిగిందన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందడుగువేయాలని సూచించారన్నారు. ఉన్నత కేరీర్‌కు నెట్‌వర్కింగ్ ముఖ్యమని విద్యార్థులు పరిశోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నట్లు వెల్లడించారు.



అంతర్జాతీయ ఇండియా సమ్మిట్-25లో పాల్గొన్న మిట్స్ విద్యార్థులు